# పిలికోళ్ళు

చిమ్మచీకటిలో బోయింగ్ విమానంలాగ అతివేగంతో పరుగు పెడుతోంది డీలక్స్‌బస్సు.

బస్సులో ప్రయాణీకులందరూ అలిసిపోయిన పెళ్లివారిలాగ కునుకు తీస్తున్నారు.

కళ్లల్లో దివిటీలేసుకున్నవాడిలా... దృష్టినంతటినీ రోడ్డుమీదే కేంద్రీకరిస్తూ అతిజాగ్రత్తగా బస్సు నడుపుతున్నాడు డ్రైవర్. భీమ సేనుడు గదని పొదివిపట్టుకున్నట్టు స్టీరింగ్‌ని రెండు చేతుల్తో పట్టుకున్న డ్రైవర్ సునాయాసంగ మలుపులు తిప్పుతూ పోనిస్తున్నాడు.

తెరచివున్న కిటికీల్లోంచి చల్లటిగాలి బస్సులోకి తోసుకొస్తూ ప్రయాణీకులందరికీ హాయిగొలుపుతోంది.

ఒక్కొవూరు దాటుతున్నప్పుడల్లా కండక్టర్ మేలుకుంటూ అందుబాటులోవున్న స్విచ్ వేసుకుని లైటు వెలుగులో 'యస్సార్లో' ఎంట్రీస్ వేసుకుని మళ్లీ లైటు ఆర్పేసి నిద్రలో జారిపోతున్నాడు. తన క్యాష్ బేగ్‌ని జాగ్రత్తగా నిద్రలో సైతం పొదివిపట్టుకునే వున్నాడు.

బస్సులో వెలుగుతున్న నీలిరంగు సన్నని బల్బు తన కాంతిని నలువైపుల ప్రసరింపచేస్తోంది.

అంత తక్కువ కాంతిలో సైతం ఆడవారి మెడలోవున్న నగలు ధగధగా మెరిసిపోతున్నాయ్! నిద్రలోకూడా అప్పుడప్పుడు తమ ఖరీదైన ఆభరణాలను తడివి చూచుకుంటున్నారు.

ప్రయాణీకుల్లో పదిమందిదాకా ఆడవాళ్లున్నారు. మిగతావారంతా మగవారే!

నాలుగోవరుసలో కిటికీ పక్కగా వున్న సీట్లో కూర్చున్న వ్యక్తి రాజారెడ్డి. మనిషి బలిష్టంగా, దృఢంగా అవుపిస్తున్నాడు. అతనిలో దర్జా, దర్పం వుట్టిపడుతోన్నాయ్.

రాజారెడ్డి పోలీసు డిపార్టుమెంట్‌లో అంచలంచలుగా ప్రమోషన్ పొంది, చివరికి యస్పీ అయ్యాడు. అటు అధికారవర్గంలో... ఇటు రాజకీయంగానూ బాగా పలుకుబడివున్నవాడు. రెండు చేతులా ఆర్జించాడు.

సిటీలో రాజారెడ్డికి రెండు బంగళాలు వున్నాయ్! బినామీ పేర్లతో నాలుగు కార్లు, పది ఆటోలు వున్నాయ్. వాటిని బాడుగకు తిప్పుతుంటాడు. చిన్నసైజు వర్కుషాపుకూడా వుంది.

కరీంనగర్‌లో కొడుకు పెళ్ళి జరిపించి బంధువర్గంతో హైదరాబాద్‌కి బస్సులో తిరుగుప్రయాణ మైనాడు.

అదే బస్సులో ఇద్దరు ముగ్గురు బడాసైజు రాజకీయ నాయకులూ వున్నారు. వారు రాజారెడ్డికి హితులు, శ్రేయోభిలాషులు!

రాజారెడ్డి పావుగంటకోమారు కళ్లు తెరిచి లగేజి రేక్‌లోవున్న బ్రీఫ్‌కేసుని తడిమి చూచుకుంటున్నాడు. అందులో లక్షరూపాయల క్యాషుంది! కొడుకు పెళ్లికి వియ్యాల వారిచ్చిన కట్నం తాలూకు డబ్బది!!

అంత డబ్బు తనవెంట తీసుకు ప్రయాణమైనందుకు ఏమాత్రం భయపడ్లేదు రాజారెడ్డి. అందుక్కారణం తాను పోలీసు అధికారిననే ధీమా!

అప్పుడప్పుడు ముందువరసలో వున్న భార్య, కొత్త కోడలు కేసి చూస్తున్నాడు. రాజారెడ్డి దృష్టి అంతా వారి మెడలో వున్న నగలమీదే!

తన పక్కసీట్లోనే కూర్చున్న అరవింద్ గాఢంగా నిద్రపోతున్నాడు. ఎం.ఏ. పాసైన అరవింద్ బ్యాంకులో ఆఫీసరయ్యేడు.

వియ్యాలవారు అరవింద్‌పెళ్ళి అత్యంత ఘనంగా జరిపించారు. వియ్యంకుడు గోవిందయ్య జిల్లాపరిషత్‌చైర్మన్. అల్లుడికి లక్షరూపాయల కట్నం... ఓ మారుతికారు ఇచ్చాడు. కూతురికి యాభై తులాల బంగారం పెట్టాడు. రంగరంగవైభోగంగా జరిగిన పెళ్లికి మినిష్టర్లు... అధికారులు... ఎందరో వందల సంఖ్యలో హాజరయ్యారు.

తనస్థాయికి తగ్గ వ్యక్తితో వియ్యమందినందుకు మురిసిపోయాడు రాజారెడ్డి.

చదువుకునే రోజుల్లోనే రెండు మూడు మర్డర్లు చేసిన గోవిందయ్య తర్వాత రాజకీయాల్లో ప్రవేశించి ఘనాపాటి అయ్యాడు. బీదా బిక్కీ నోళ్లుకొట్టాడు. బంజరు భూముల్ని అక్రమంగా ఆక్రమించుకున్నాడు. పలుకుబడితో ప్రజల నోట్లోదుమ్ము, ప్రభుత్వం కంటిలో కారం కొట్టేడు. పాతికేళ్ల రాజకీయ జీవితంలో కోట్లకి పడగెత్తాడు.

ముగ్గురు ఆడపిల్లల పెళ్లిళ్లు చేసాడు. ఇద్దరు కొడుకులను విదేశాల్లో

చదివిస్తున్నాడు. గోవిందయ్యవంటి వ్యక్తితో వియ్యమందటం తన అదృష్టంగా భావించాడు రాజారెడ్డి.

బస్సు కుదుపుకి మెలకువ వచ్చింది. తన బ్రీఫ్‌కేసువేపు చూచుకున్నాడు. అంతలోనే రకరకాల ఆలోచన్లు రాజారెడ్డి మనసులోకి జొరబడ్డయ్.

అసలే రోజులు బాగాలేవు. ప్రతిరోజూ బస్సు ప్రయాణీకుల్ని దొంగలు దోచుకుంటున్న సంగతి తనకు తెలుసు! అయినా సాహసించి డబ్బుతో, నగలతో బయల్దేరాడు.

ఎవరైనా దుండగులు దాడిచేస్తే...? తనవద్ద రివాల్వర్ అయినా లేదు. గుండె జల్లుమంది. పోలీసు ఆఫీసరైవుండి కూడా రాజారెడ్డిని అధైర్యం ఆవహించింది. మనిషిలో భయం... ఆందోళన చోటుచేసుకోనారంభించాయి.

'ఛీ! ఏమిటి తాను ఇట్లా పిరికిగా ఆలోచిస్తున్నాడు? తనకేం భయంలేదు...' అనేసి తనను తాను సంబాళించుకున్నాడు.

తానుతప్ప మిగతా ప్రయాణీకులంతా నిద్రపోవటం గమనించాడు.

బస్సు పరుగుపెడుతూనేవుంది.

చివరిదాకా కాలిన సిగరెట్ పీకని కిటికీలోంచి బైటికి విసిరేశాడు రాజారెడ్డి.

తలవెనక్కి తిప్పి ఓమారు చూశాడు. చివరి సీట్లో వెనుకగా వున్న ఓ తలపాగా మనిషి బీడీ తాగుతూ కనిపించాడు. అతనెందుకు మేలుకుని వున్నాడు? మసక వెలుగులో అతనివేపు పరీక్షగా చూశాడు. మనిషి మొరటుగా వున్నాడు. చదువు, సంధ్యాలేని పల్లెటూరు బైతులా అవుపించాడు. అతన్లాంటి బీదవాడు ఖరీదైన డీలక్స్ బస్సులో ఎందుకు ప్రయాణిస్తున్నట్టు?... అసలు ఆ వ్యక్తి ఎలాంటివాడై వుంటాడు? మారువేషంలో ప్రయాణిస్తున్న దొంగేమో?... ఛ! ఏమిటి తాను చేస్తున్న పని?... సాటిమనిషిని అనవసరంగా అనుమానిస్తున్నాడు.

అతనూ అప్పుడప్పుడు తనవేపే చూస్తున్నాడు. అతని చూపులు అనుమానంగా వున్నాయ్. నో!... ఇలాంటి వాళ్లని నమ్మటానికి వీల్లేదు. పైకి నంగనాచిలా అమాయకుల్లా అవుపించేవాళ్లే అసలుసిసలైన దొంగలు. తన సర్వీసులో ఇలాంటి వారిని ఎందర్ని చూడలేదు గనుక?!...

అందరూ నిద్రలో వుండటం గమనించి చేతికి అందిన సూట్‌కేస్ ఏదైనా అందుకుని మధ్యమార్గంలో దిగిపోతాడేమో?

ఆ వ్యక్తి కూర్చున్న వాడల్లా లేచి నిలబడడం చూశాడు. నడుచుకుంటూ

ముందుకు వస్తున్నాడు. అమ్మో!... వీడు దొంగే అయివుంటాడు. లేకపోతే అందరూ నిద్రలో వుండగా వీడొక్కడే ఎందుకు అతని సీటులోంచి లేచివస్తున్నట్టు?...

అతని ప్రతిచర్యనీ అతిజాగ్రత్తగా ఓ కంట గమనిస్తున్నాడు రాజారెడి.

వీడు 'కేడీ' అయివుండొచ్చు! కాదు దొంగేకావచ్చు!! నోనో! వీడు తప్పకుండా బందిపోటే అయివుంటాడు! గుండెలు తీసిన బంటే... వీడొక్కడే కాదు... బహుశా వీడి మనుష్యులు ఇంకా బస్సులో వుండివుంటారు.

తాను తొందరపడకూడదు. వాడేం చేస్తాడో గమనించి రెడ్‌హేండెడ్‌గా పట్టుకోవటం మంచిదన్పించింది.

ఆ వ్యక్తి తడువుకుంటూ ముందుకు నడుస్తూ వస్తున్నాడు. తనను దాటిపోయి డ్రైవర్ వేపు వెడుతున్నాడు.

బస్సు ఆపమని డ్రైవర్ని అడుగుతాడేమో? బస్సు ఆపకపోతే కత్తితో డ్రైవర్ని బెదిరిస్తాడు... వాడు దొంగే!... సందేహంలేదు!!

డ్రైవర్ని సమీపించి అతనితో ఏదో మాట్లాడాడు.

కీచుమని శబ్దంచేస్తూ ఆగింది బస్సు. లైట్లు వెలిగాయి.

ఆ వ్యక్తిని ఇప్పుడు లైటువెల్తుర్లో పరీక్షగా చూశాడు రాజారెడ్డి, తలకు పాగా... వంటిన ముతకచొక్కా... రంగువెలిసిపోయిన గళ్లపంచ... కాళ్లకు అరిగిపోయిన చెప్పులు... బస్సు ఆగటంతో ప్రయాణీకులంతా మేలుకున్నారు.

''ఏయ్... ఎందుకు బస్సు ఆపావ్?'' - గద్దించాడు రాజారెడ్డి.

ఆ వ్యక్తి భయపడలేదు. బెదిరిపోలేదు. తనవేపు అదోలా చుశాడు. బదులు పలక్కుండా కుడిచెయ్యి పైకెత్తి నాలుగువేళ్లు ముడిచి చిటికెనవేలు చాచి చూపాడు.

''పాసుకి వెళ్లాలట సార్!... '' సీట్లో కూర్చున్న డ్రైవర్ వెనక్కు తిరిగి రాజారెడ్డిని వుద్దేశించి జవాబిచ్చాడు.

రాజారెడ్డి టెన్షన్ తగ్గింది. గట్టిగా గాలిపీల్చుకున్నాడు.

ఆ వ్యక్తి బస్సుదిగేడు. అతనితోపాటు మరికొంతమందీ దిగారు.

ఓ అయిదునిమిషాల తర్వాత అందరూ బిలబిలమంటూ బస్సులోకి జొరబడ్డారు.

కండక్టర్ పాసింజర్లంతా వచ్చారని నిర్ధారించకుని డోర్‌వేసుకుని రైట్ చెప్పాడు.

హారన్ మోగించి ఇంజన్ స్టార్ట్ చేశాడు డ్రైవర్.

బస్సు మెల్లగా బయల్దేరి క్రమేపీ వేగాన్ని పుంజుకుంది. బస్సులో లైట్లు మళ్లీ ఆరిపోయినయ్.

ఛ! ఏం మనిషి తాను? అనవసరంగా సాటిమనిషిని అనుమానించటం ఎంత అన్యాయం? తాను ఎంత పోలీసు ఆఫీసర్ అయితే మాత్రం - ఓ అమాయకుడ్ని దొంగకింద జమకట్టి ఆలోచించాలా?

తనను తాను నిందించుకున్నాడు రాజారెడ్డి. క్షణం క్రితంవరకు తనను ఆవహించిన ఆందోళన, భయం క్రమేపీ దూరమైనయ్ రాజారెడ్డిలో. మనిషి స్థిమితపడ్డాడు. సిగరెట్ వెలిగించి లగేజ్ కేరియర్లో వుంచిన తన డబ్బున్న బ్రీఫ్‌కేసు తృప్తిగా చూచుకొని నవ్వుకున్నాడు.

సిగరెట్ తాగటం పూర్తి అయింది. రిస్ట్‌వాచి కేసి చూచుకున్నాడు. అప్పటికి సరిగ్గా అర్ధరాత్రి పన్నెండుగంటలైంది. గాలి ఉధృతాన్ని తగ్గించటంకోసం విండో గ్లాసు డోరు మూసేశాడు.

ఆవులించి కళ్లు రెండూ మూసుకున్నాడు రాజారెడ్డి. నాలుగైదు రోజులైంది తాను కంటినిండా నిద్రపోయి. పెళ్లి హడావిడితో నిద్రకి నోచుకోలేదు. కళ్లు మూసుకోగానే నిద్ర ముంచుకొచ్చేసింది.

సముద్రాన్నే ఈదాలనుకున్న గజ ఈతగాడిలాగ గమ్యాన్ని చేరుకోవాలనే లక్ష్యంతో బస్సు తారురోడ్డుమీద వేగంగా పరుగిడుతోంది.

డ్రైవర్‌దృష్టి రోడ్డుమీదే లగ్నమైవుంది. అప్పుడప్పుడు కళ్లు నలుపుకుంటున్నాడు. అవులింతలు ముంచుకొచ్చేస్తున్నాయ్. రెప్పలు వాలిపోతున్నాయ్. నిద్రాదేవిని దూరతీరాలకు తరిమెయ్యాలని జేబులో బీడీతీసి ముట్టించాడు.

ఎదురొచ్చే వాహనాల శబ్దం... ముందు లారీలని దాటుకుపోవాలనే వుద్దేశంతో డీలక్స్ బస్సు డ్రైవర్ చేస్తున్న హారన్‌చప్పుడు... నిద్రావస్థలోవున్న ప్రయాణికులకు అప్పుడప్పుడు ఇబ్బంది కలిగిస్తోన్నాయ్. పూర్తిగా రెప్పలు విప్పార్చకుండా... నొసలు చిట్లించి విసుగు ప్రదర్శిస్తూ మళ్లీ నిద్రలోకి జారబడుతున్నారు బస్సులో ప్రయాణికులు.

అనుకోకుండా బస్సువేగం తగ్గింది. కీచుమని శబ్దంచేస్తూ ఆగింది.

"ఏం గురూ!... ఎందుకు ఆపావ్?" డ్రైవర్‌ని వుద్దేశించి ప్రశ్నించాడు కండక్టర్.

డ్రైవర్ జవాబిచ్చేలోపుగా "ఏదైనా యాక్సిడెంటా?..." విసుక్కుంటూ అడిగేడు కండక్టర్ మళ్లీ.

"కాదు సైదులూ!... రోడ్డుకి అడ్డంగా పెద్దపెద్ద బండరాళ్లు పెట్టారెవరో...

నువ్వోమారు కిందికి దిగి వాటిని పక్కకి ఈడ్చెయ్. లేకపోతే బస్సుపోదు....''
బస్సుఆగటానికి గల కారణం వివరించాడు డ్రైవర్.

కండక్టర్ సైదులు విసుగు ప్రదర్శించాడు. అన్ని రాళ్లను పక్కకి తియ్యటానికి మరోమనిషి సాయం అవసరం అన్పించిందో ఏమో... ''గురూ! హెడ్‌లైట్లు అట్లాగే వేసివుంచి... నువ్వూ దిగిరా!... ఇద్దరం కలిసి రాళ్లని అవతలికి ఈడ్చేద్దాం... '' అన్నాడు.

బస్సులో లైట్లన్నీ వేశాడు డ్రైవర్. వాళ్లిద్దరి సంభాషణ హెచ్చుస్థాయిలో వుండటంతో ప్రయాణికులంతా మేలుకున్నారు.

బైట అంతా చిమ్మచీకటి! బస్సు దిగటానికి సైదులు భయపడుతున్నాడు. క్యాష్ బేగ్‌ని జాగ్రత్తగా పొదివిపట్టుకున్నాడు.

''మేం కూడా సాయం చేస్తాంలే, పద కండక్టరూ!...'' ఇద్దరు ముగ్గురు ప్రయాణికులు అన్నారు.

అంతలో బస్సు మీద రాళ్లవర్షం కురిసింది. ప్రయాణికులంతా బెంబేలుపడ్డారు.

బైటినుంచి కొన్నిగొంతులు తలుపుతెరవమంటూ కేకలు పెడుతున్నాయ్.

బస్సు అద్దాలన్నీ తునాతునకలవుతున్నాయ్. ఆడా మగా అంతా భయంతో వొణికిపోతున్నారు. పెద్ద పెద్ద బండరాళ్లతో బైటి మనుషులు కండక్టర్ డోరుమీద బాదుతూనేవున్నారు.

ఆపద ముంచుకొచ్చినందుకు గడగడా వణికిపోతున్నాడు కండక్టర్ సైదులు.

డోర్‌లాక్ విరిగిపోయింది. తలుపు తెర్చుకుంది.

అయిదుగురు ఆగంతుకులు బస్సులోకి జొరబడ్డారు. వాళ్ళంతా నిక్కర్లు బనీన్లు ధరించివున్నారు. వాళ్ల చేతుల్లో నాటు కత్తులు... రివాల్వర్లూ వున్నాయ్.

ప్రయాణికుల్లో ఆందోళన... భయం! ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని వణికిపోసాగేరు.

రాజారెడ్డికి పరిస్థితి అర్థమైంది. దోపిడీదొంగలబారినుండి తప్పించుకోవడం అసాధ్యమన్పించింది.

ఆడవారంతా తమ పైట కొంగుల్ని మెడచుట్టూ కప్పుకున్నారు-మెళ్లో నగలు దొంగలకు అవుపించకుండా వుండాలనే ప్రయత్నంలో.

''ఎక్కడివాళ్లక్కడ కూర్చోండి. కదిలారో -ప్రాణాలు దక్కవ్!... '' దోపిడీ దొంగలు హుకుం జారీ చేసారు.

మగాళ్లంతా గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయారు. నోరుమెదుపగల సాహసం ఎవ్వరికీ లేకపోయింది. ప్రాణభయంతో... గుండెదడతో నిమ్మకి నీరెత్తినట్లు వుండిపోయారంతా!

నిర్దయతో ఆడవాళ్లని బెదిరించి, వారి మెడలో సొమ్ము లాగేసుకున్నారు. వెక్కి వెక్కి ఏడుస్తూ ఇవ్వమని మొండికేసినవాళ్లను చంపుతామని బెదిరించి బలవంతాన లాక్కున్నారు. గత్యంతరంలేక మెడలో మంగళసూత్రాలతోసహా ఇచ్చేశారు.

మగాళ్లని దబాయించారు... తిట్టారు... కొట్టి గాయపరిచారు.

కండక్టర్ చంకలోవున్న క్యాష్‌బ్యాగ్‌ని వూడబెరుక్కున్నారు.

పిల్లలంతా ఏడుపు లంకించుకున్నారు. రాజారెడ్డి ఆలోచనంతా బ్రీఫ్‌కేసులోవున్న లక్ష రూపాయల క్యాష్‌మీదే వుంది. కట్నం తాలూకు వియ్యాలవారిచ్చిన డబ్బంతా దొంగలకు అప్పగించాల్సి వచ్చిందేని మనసులో దిగులుపడ్డాడు.

తాను పోలీసు అధికారి! తన సర్వీసులో ఎన్నో సాహసకృత్యాలు చేశాడు. దొంగలని, రౌడీలని, హంతకులను చావగొట్టాడు, లాకప్‌లో పెట్టాడు. వాళ్లగుండెల్లో నిద్రపోయాడు. వాళ్ళపాలిట సింహస్వప్నంగా వ్యవహరించాడు.

కానీ... ఇప్పుడో?

వాళ్ళని వంటరిగా ఎదిరించగల సాహసానికి వొడిగట్టగల స్థితిలో లేడు. తనవెంట రివాల్వర్ అయినా వుండివున్నట్టయితే... ఆ పరిస్థితి మరోరకంగా వుండివుండేది.

తానొక్కడూ వాళ్ల మీద తలపడినా ప్రయోజనం శూన్యమన్పించింది. తాను నిరాయుధుడు. తోడి ప్రయాణికులెవ్వరూ తనకు సహాయపడటానికి వప్పుకోరు. అప్పుడు తన పరిస్థితి ఏమిటి?

వంటరిపోరాటంలో తాను ఓడిపోకతప్పదు.

అంతేకాదు... వాళ్ళు రెచ్చిపోయి తనను గాయపరుస్తారు. పిరికితనం రాజారెడ్డిని ఆవహించింది. స్వార్థం మనిషిలో చోటుచేసుకుంది!

డబ్బున్న బ్రీఫ్‌కేసుని వాళ్లకి అప్పగించటానికే సిద్ధపడ్డాడు.

ఛ! ఏమిటి తాను చేస్తున్నది? పోలీసు ఆఫీసరైవుండి... దొంగవెధవలకి తలవంచి, వాళ్లకి లొంగిపోవటమా? పిరికిగా ఆలోచిస్తూ... అధైర్యపడితే అది తన ఉద్యోగానికి, హోదాకి అవమానం...

ఎటూ తేల్చుకోలేని డోలాయమానస్థితిలో వుండిపోయాడు రాజారెడ్డి.

ఏమైనా తానూ మనిషే! పౌరుషంతోపాటు తన్లోనూ చీము నెత్తురు వున్నాయ్!! తన స్వార్థం తాను చూచుకోవటంలో తప్పులేదన్పించింది.

పోనీ... ప్రాణాలకి తెగిస్తే ఏమౌతుంది? తనను వాళ్లు చంపుతారు! అంతేగా? రాజారెడ్డిలో ఘర్షణ పెరిగింది.

"సూత్తారేందర్రా... ఈ నా కొడుకుల్ని... అందరం ఏకమై ఎదిరిస్తే పోలా?... వాళ్లంతా కలిపి అయిదుగురేగా?... ఇంతమంది మగాళ్లం మనం అందరం వాళ్లని చావగొట్టలేమా?... "

రాజారెడ్డి వెనుకవేపు కిటికీ పక్కగా కూర్చున్న తలపాగా ధరించిన పల్లెటూరు మనిషి ఆవేశంతో పెద్దగా అరిచాడు.

ఒక బందిపోటు ఆ తలపాగా మనిషిని కత్తితో గాయపరిచాడు వుక్రోషం పట్టలేక.

ప్రయాణికులందరితోపాటు రాజారెడ్డికూడా చూస్తూ వుండిపోయాడు. వారి చర్యను నివారించలేని బలహీనుడే అయ్యాడు.

ఇంతలో మరో బందిపోటు రాజారెడ్డి దగ్గరగా వచ్చాడు. లగేజ్ రేక్‌మీదన్న బ్రీఫ్‌కేసుని అందుకున్నాడు.

"ఇందులో ఏముంది?" గద్దించాడు బందిపోటు రాజారెడ్డిని చూస్తూ.

నిజం చెప్పటమా... వద్దాని లిప్తపాటు ఆలోచించాడు రాజారెడ్డి.

బలవంతాన బ్రీఫ్‌కేసు తెరిచిన బందిపోటు అందులోవున్న నోట్లకట్టల్ని చూస్తూ పెద్దపెట్టున నవ్వాడు.

పావుగంటలో కార్యక్రమాన్ని పూర్తిచేసుకున్న దొంగలు గబగబా బస్సు దిగి, చేజిక్కించుకున్న నగలతో, డబ్బుతో చీకట్లో అదృశ్యమైనారు.

ప్రయాణీకులందరిలో కలకలం మొదలైంది. ఎవరికి తోచినట్టు వాళ్లు మాట్లాడటం ప్రారంభించారు:

"మనమంతా మగోళ్లంకాదు... పిరికినాయాళ్లం!... ఇంతమందిమి

బస్సులోవుండికూడా వాళ్లని ఎదిరించలేకపోయాం! నోళ్లు మెదపలేకపోయాం!... మనదగ్గరున్నదంతా వాళ్లకే అప్పగించాం. ఛీ! మనమూ మగాళ్లమేనా?'' తలకి బలమైన గాయం తగిలినా శక్తినంతా కూడగట్టుకుని రోషపడిపోతూ ఆవేశంగా మాట్లాడాడు తలపాగా మనిషి!

అవును. తలపాగా వ్యక్తి చెప్పింది అక్షరాలా నిజం! పోలీసు అధికారి అయివుండికూడా వాళ్లను ఎదుర్కోలేకపోయాడు. ఎంత సిగ్గుచేటు?
తీరని అవమానభారంతో కృంగిపోయిన రాజారెడ్డి దోషిలాగా తలవంచుకు వుండిపోయాడు.

తలపాగా వ్యక్తిలోవున్న ధైర్యం, సాహసం, తెగింపు తనలో లేకపోయినందుకు మనసులో సిగ్గుపడ్డాడు రాజారెడ్డి.

దొంగకాని తలపాగా వ్యక్తిని తాను కొన్నిగంటలక్రితం అనవసరంగా అనుమానించాడు. తీరా దొంగలు సర్వస్వం దోచుకుంటున్నప్పుడు నోరుమెదప లేకపోయాడు. వాళ్లని ప్రతిఘటించకపోయాడు.

అవును! అందరిలాగా తానూ పిరికివాడే అయ్యాడు!!

---

★ (ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 12-8-1993 సంచికలో ప్రచురితం)

With Best Wishes From

# BAMBINO AGRO INDUSTRIES LTD.

4E, Surya Towers, S.P. Road, Secunderabad - 500 003. A.P.

Phone : 7816611 (3 Lines), Fax : 091-40-7816615

***We Bring Taste and Convenience to Life***